క్లుప్తంగా

మంత్రి శ్రీధర్‌బాబుకు వినతి



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

జమ్మికుంట: దళితబంధు లబ్ధిదారులకు రెండో విడుత నిధుల విడుదల చేయాలని తెలంగాణ అంబేడ్కర్ యువజన సంఘం హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి, జమ్మికుంట మండలం విలాసాగర్ గ్రామానికి చెందిన రాచపల్లి సాగర్ ఆధ్వర్యంలో నాయకులు హైదరాబాద్‌లో రాష్ట్ర ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతమ్‌కు మంగళవారం వినతిపత్రాలు అందజేశారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షుడు నరేష్, కార్యదర్శి సతీష్, మండల నాయకులు ప్రశాంత్, అశ్విన్, గణేష్,రమేష్, సాయిఉన్నారు.

విద్యార్థులకు అవగాహన



విద్యార్థులతో బ్యాంక్ అధికారులు, టీచర్లు

హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో విజిలెన్స్ సేవలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు డ్రాయింగ్, క్విజ్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బ్యాంక్ అధికారులు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్, బ్యాంక్ మేనేజర్ శ్రావన్‌కుమార్, హెచ్‌ఎం తిరుమల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సర్వేకు సహకరించాలి

హుజూరాబాద్‌రూరల్: సమగ్ర సర్వేకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ సల్వాది సమ్మయ్య కోరారు. కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మున్సిపల్ పరిధిలోని 30 వార్డులను 2011 జనాభా లెక్కల ప్రకారం 63 బ్లాకులుగా విభజించామని, బ్లాక్‌కు ఎన్యూమరేటర్‌ను, వీరిని పర్యవేక్షించడానికి ఆరుగురు సూపర్‌వైజర్లు ఉంటారని తెలిపారు.

శిక్షణ కేంద్రం సందర్శన



మాట్లాడుతున్న గంగాడి కృష్ణారెడ్డి

జమ్మికుంట: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని చేతివృత్తులు, కళాకారులకు విశ్వకర్మ యోజన పథకం గొప్ప వరమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. బోనగిరి శ్రీధర్ ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహిస్తున్న విశ్వకర్మ యోజన ట్రెనింగ్ సెంటర్‌ను మంగళవారం బీజేపీ శ్రేణులతో కలిసి సందర్శించారు. చేతిపనులు, కళాకారుల ఉత్పత్తుల నాణ్యతను పెంచడం, దేశీయ గ్లోబల్ మార్కెట్‌తో అనుసంధానించడం పథకం ఉద్దేశమన్నారు. రోజువారీ రూ.500 శిక్షణలో అందజేస్తూ, విశ్వకర్మ సర్టిఫికెట్‌తో పాటు గుర్తింపు కార్డు, రుణం అందజేస్తారని వివరించారు. జమ్మికుంట కేంద్రంగా సుమారు 5వేల మందికి శిక్షణ కొనసాగుతుందని, ప్రజలు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో విశ్వకర్మ యోజన కోఆర్డినేటర్ ఆకుల రాజేందర్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సంపత్‌రావు, పట్టణ అధ్యక్షుడు జీడి మల్లేశ్, నాయకులు పల్లపు రవి, ఇటికాల స్వరూప, తూడి రవిచంద్రరెడ్డి, బచ్చు శివకుమార్, మోడం రాజు, రావుల శ్రీనివాస్, నాగేష్, రామ్, నిరుపారాణి, ముకుంద సుధాకర్, రవితోపాటు తదితరులు పాల్గొన్నారు.

సీసీ పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న రాధిక, కౌన్సిలర్లు

హుజూరాబాద్‌రూరల్: మున్సిపల్ పరిధి పోచమ్మవాడలోని పోచమ్మగుడి ఆవరణలో మంగళవారం సీసీ ప్లాట్‌ఫామ్ పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, కౌన్సిలర్లు ప్రతాప తిరుమల్‌రెడ్డి, అపరాధ ముత్యంరాజు అధికారులతో కలిసి ప్రారంభించారు. అనంతరం రాధిక మాట్లాడుతూ.. పనులు సకాలంలో నాణ్యతతో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పట్టణ అభివృద్ధే ధ్యేయంగా పాలకవర్గం పని చేస్తుందని, రూ.ఐదు లక్షలతో సీసీ పనులు చేస్తున్నామని తెలిపారు. పోచమ్మ గుడికి భక్తుల తాకిడి పెరుగుతున్నందున పాలకవర్గం దశల వారీగా అభివృద్ధి పనులకు సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సల్వాది సమ్మయ్య, ఏఈ సాంబరాజు, ఆలయ కమిటీ పాలకవర్గం, తదితరులు పాల్గొన్నారు.

రిపేర్ సెంటర్లు ఎక్కడో..!

- దివ్యాంగుల ఉపకరణాల మరమ్మతులకు ఇబ్బందులు
- ఎక్కడ బాగు చేస్తారో తెలియని పరిస్థితిలో వికలాంగులు
- సుదూర ప్రాంతాలకు వెళ్లలేక విలవిల
- ప్రభుత్వం స్పందించాలని వేడుకోలు



హుజూరాబాద్ భవిత సెంటర్‌లో శిక్షణ పొందుతున్న దివ్యాంగులు

హుజూరాబాద్‌రూరల్: దివ్యాంగులు విధిని ఎదురించి జీవితంలో గెలుద్దామనుకుంటున్నారు, ప్రజాప్రతినిధులు, మరెవరైనా జాలీ చూపకుండా వారిని ప్రోత్సహించి చేయూతనందిస్తే సమాజంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటారు. ప్రభుత్వం పంపిణీ చేసిన ఉపకరణాలను ఎక్కడ మరమ్మతు చేయించుకోవాలి, బాగు చేసే కేంద్రాలు ఎక్కడ ఉంటాయో తెలియక దివ్యాంగులు ఇబ్బంది పడుతున్నారు.

అలాగే 16 నుంచి 45 సంవత్సరాల పైబడిన దివ్యాంగులు సుమారు 330 మంది వరకు ఉంటారని అధికారులు పేర్కొంటున్నారు. శారీరక, మానసిక వైకల్యం కలిగిన వారికి ఆర్థోటిక్స్, క్యాలీఫర్స్, కృతిమకాళ్లు ఎంతో అవసరం ఉంటుంది. కొంతమందికి జన్మతా వైకల్యం, మరికొంత మంది అనుకోని సంఘటనలు, ప్రమాదాల వల్ల శారీరక వికలాంగులుగా మారుతున్నారు. వీరికి ఉపకరణాలు తప్పనిసరి అవసరమవుతాయి. పిల్లలకు, పెద్దలకు శారీరక లోపాలను బట్టి వివిధ రకాల ఉపకరణాలు ఉపయోగించాల్సి ఉంటుంది. ఇవి దివ్యాంగుల్లో ధైర్యం, ఉత్సాహం, మానసికశక్తి, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందిస్తాయి.

మరమ్మతులు లేక విలవిల...

జిల్లా, డివిజన్ కేంద్రాల్లో ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు ఉపకరణాలు, కృతిమ అవయవాల పంపిణీ శిబిరాలను ఏర్పాటు చేసినప్పుడు సుమారు 800 నుంచి 1000 మంది హాజరవుతంటారు. నిత్యం ఉపయోగిస్తుండడం వల్ల పాడైపోయే అవకాశం ఉంది. వాటిని పరీక్షించి మరమ్మతులు చేయాలి. కానీ వాటిని సరిచూసే కేంద్రాలు హైదరాబాద్ వంటి సుదూర ప్రాంతాల్లో ఉండటంతో వ్యయ,ప్రయాసలతో కూడుకున్నది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేదలు మరమ్మతులకు విలవిలలాడుతున్నారు.

హుజూరాబాద్ డివిజన్ వ్యాప్తంగా ఐదు నుంచి పదహారేళ్లలోపు దివ్యాంగుల వివరాలు

క్రసం	మండలం	యూడైస్‌లో నమోదైన పిల్లలు	శిక్షణలోని పిల్లలు	ఫిజియోథెరపీలోని పిల్లలు
01	హుజూరాబాద్	86	16	25
02	జమ్మికుంట	92	16	16
03	వీణవంక	86	16	09
04	ఇల్లందకుంట	46	08	10
05	సైదాపూర్	52	08	06
		362	64	66

హుజూరాబాద్ డివిజన్ పరిధి, పలు గ్రామాలకు చెందిన దివ్యాంగ పిల్లలు సుమారు 64 మంది మండల కేంద్రంలోని భవిత సెంటర్‌లో ఫిజియోథెరపి, స్పీచ్‌థెరఫిలో శిక్షణ పొందుతుంటారు. రవాణా భత్యం కింద రూ.350 చెల్లిస్తుంటారు. ఏటా డాక్టర్లతో అసెస్మెంట్ క్యాంపు నిర్వహించి అర్హులైన పిల్లలకు ఉపకరణాలను పంపిణీ చేస్తున్నారు. ఒకటి లేదా రెండేళ్ల పాటు శిక్షణ పొందిన పిల్లలను స్కూల్‌లో ఎన్‌రోల్ చేస్తుంటారు. స్కూల్‌కు వెళ్లని పిల్లల వద్దకు ఐఈఆర్‌పీ టీచర్స్ ట్రైనింగ్ ఇస్తుంటారు.

హైదరాబాద్ వెళ్లాల్సి వస్తోంది



పరికరాలు రిపేర్ చేయిద్దామంటే కరీంనగర్, వరంగల్ ప్రాంతాల్లో రిపేర్ సెంటర్లు లేకపోవడంతో హైదరాబాద్‌కు వెళ్లాల్సి వస్తోంది. అధికారులు, ప్రభుత్వం స్పందించి హుజూరాబాద్ డివిజన్‌లో మరమ్మతు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నాం.

– మ్యాకల ప్రభాకర్‌రెడ్డి, హుజూరాబాద్

త్వరగా కోలుకుంటారు



భవిత సెంటర్‌లో ఫిజియోథెరపి చేయడం వల్ల దివ్యాంగులకు చాలా ప్రయోజనం చేకూరుతుంది. మరికొంత మంది తమ పనులు చేసుకునే విధంగా మారారు. దివ్యాంగులను చిన్నచూపు చూడకుండా ప్రోత్సహిస్తే ఇంక త్వరగా కోలుకునే అవకాశం ఉంది.

– ఎ. స్వప్న, ఫిజియోథెరపిస్టు, డివిజన్ ఇన్‌చార్జి

ప్రభుత్వం ప్రోత్సహించాలి



దివ్యాంగులను ఉన్నత స్థానాలకు తీసుకెళ్లడమే లక్ష్యం. మానసిక స్థితిగతులకు అనుగుణంగా శిక్షణ ఇస్తున్నాం. ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా వైద్య సిబ్బందితో ఎప్పటికప్పుడు పరీక్షలు చేయిస్తున్నాం. ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తే మెరుగైన సేవలు అందుతాయి.

– డి.జ్యోతి, భవిత రిసోర్స్‌పర్సన్, హుజూరాబాద్



హుజూరాబాద్‌రూరల్: మండలంలోని జూపాక గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. రహదారి పక్కన ఉండడంతో ఏక్షణంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు, వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
ఎ.సంతోష్‌కుమార్, ఏఈ, సెల్ నం 85001 20227

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9848408781, 8790144227, 9393557752

విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్

చొప్పదండి: విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. వెంకటేశ్ అన్నారు. మండలంలోని రుక్మాపూర్ మోడల్ స్కూల్‌లో పోక్సో, మాదకద్రవ్యాలు, బాలల హక్కులు, బాల్య వివాహాలు, ర్యాగింగ్ చట్టాలపై మంగళవారం అవగాహన సమావేశం నిర్వహించారు. టీనేజీలో వివిధ సంఘర్షలను ఎలా ఎదుర్కోవాలో వివరించారు. కార్యక్రమంలో డీఈవో జనార్దన్‌రావు, జిల్లా డిఫెన్స్ కౌన్సిలర్ టి. మహేశ్, ఎంఈవో శ్రీనివాస దీక్షితులు, ఎస్‌ఐ గొల్లపల్లి అనూష, ప్రిన్సిపాల్ సుధాకర్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అవగాహన పెంచుకోవాలి

చొప్పదండి: ఆంగ్లభాషపై పట్టు కోసం నిర్వహిస్తున్న టిడెక్స్‌పై ఉపాధ్యాయులు, విద్యార్థులకు అవగాహన ఉండాలని జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు అన్నారు. పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో రివ్యూ సమావేశం నిర్వహించి విద్యార్థులతో మాట్లాడారు. టిడెక్స్‌లో నైపుణ్యం కనబరిచి ఆంగ్లంలో మాట్లాడిన సింధు అనే తొమ్మిదో తరగతి విద్యార్థిని అభినందించి నగదు పారితోషికం అందించారు. హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు మహేశ్, శ్రీనివాస్, పల్లవి, తిరుపతి, ముకుందరెడ్డి పాల్గొన్నారు.

మట్టి తవ్వకాలపై అధికారుల విచారణ



విచారణ చేస్తున్న అధికారులు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని రంగాపూర్, సిర్సపల్లి శివారులోని పాండవుల గుట్ట సమీపంలో అసైన్డ్ భూమిలో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుపుతున్నారనే ఫిర్యాదుపై అధికారులు స్పందించారు. మంగళవారం హుజూరాబాద్ ఆర్డీవో రమేశ్ బాబు, మైనింగ్ అండ్ జియాలజీ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.రామాచారి ఆధ్వర్యంలో విచారణ చేశారు. క్రషర్, క్వారీల పరిధిని పరిశీలించారు. రెండు క్రషర్లను డీఫాల్టర్లుగా గుర్తించారు, విద్యుత్ కనెక్షన్ల తొలగింపు, తదుపరి చర్యలకు విద్యుత్‌శాఖ అధికారులకు సిఫారసు చేశారు. అనుమతిలేకుండా మట్టితవ్వకాలు చేస్తున్న ఓ కంపెనీకి ఇదివరకే ఫైన్ వేశామన్నారు. రాత్రివేళ మట్టి సరఫరా జరగకుండా ఉండేందుకు వాహనాలు రాకుండా చెక్‌పోస్ట్, క్వారీ వద్ద కంపౌండ్ వాల్ నిర్మించి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే ఈటీఎస్ సర్వే చేయాలని సిబ్బందిని ఆదేశించారు. బాధితులంతా వస్తే లోతుగా విచారణ జరిపి, న్యాయం చేస్తామని ఫిర్యాదుదారులు కోడూరి సమ్మయ్య, మాజీ సర్పంచ్ ఆరెపెల్లి ఎల్లయ్య, కండె తిరుపతికి అధికారులు హామీ ఇచ్చారు.

భూనిర్వాసితులతో గ్రామసభ




రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో రమేశ్‌బాబు

చిగురుమామిడి: ప్రస్తుత మార్కెట్ రేటుకు అనుగుణంగా పరిహారం ఇవ్వాలని కెనాల్‌లో భూములు కోల్పోతున్న రైతులు డిమాండ్ చేశారు. మండలంలోని నవాబుపేట్ గ్రామంలో గౌరవెల్లి ప్రాజెక్టు సాగునీటి కాల్వల నిర్మాణంలో భూములు కోల్పోతున్న నిర్వాసితులతో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. భూసేకరణ ప్రత్యేక కలెక్టర్ కిరణ్‌ప్రకాశ్ అధ్యక్షత వహించగా ఆయన ముందు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరాకు కనీసం రూ.30 లక్షలు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిహారం ఇస్తామని, రైతుల విన్నపాల దృష్ట్యా మరోసారి గ్రామసభ నిర్వహిస్తామని కిరణ్‌ప్రకాశ్ తెలిపారు. రైతులకు న్యాయం చేస్తామని, సహకరిస్తే తొందరలోనే కాల్వ తవ్వకం పనులు ప్రారంభిస్తామన్నారు. గ్రామసభలో తహసీల్దార్ ఎం. రమేశ్, భూసేకరణ డిప్యూటీ తహసీల్దార్ నిఖిలారెడ్డి, డీఈఈ ప్రశాంత్ పలువురు అధికారులు గ్రామస్తులు పాల్గొన్నారు.

సైదాపూర్: మండలంలోని రాయికల్, ఆకునూర్ గ్రామాల్లో హుజూరాబాద్ ఆర్డీవో రమేశ్‌బాబు గ్రామసభ నిర్వహించారు. గౌరవెల్లి రిజర్వాయర్ డీ–5 కుడి కాలువ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులతో మాట్లాడారు. కెనాల్ పనులు పూర్తయితే సైదాపూర్ మండలం సస్యశ్యామలం అవుతుందన్నారు. ఇరిగేషన్ ఈఈ రాములు, డీఈ చైతన్య, తహసీల్దార్ మంజుల ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

ఇల్లందకుంట: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మంగళవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఐకేపీ సెంటర్లు ప్రారంభించకపోవడంతో రైతులు వడ్లను ప్రైవేటుగా అమ్ముకొని నష్టపోతుంటే ప్రభుత్వం ఏం చేస్తుందని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు సరిగొమ్ముల వెంకటేశ్, దరుగుల రాకేశ్, దంసాని కుమార్, వాసుదేవరెడ్డి, ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంట: మండలంలోని మాచనపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బొజ్జం తిరుపతిరెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్నాడు వైద్య ఖర్చులకు ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి లక్ష రూపాయల చెక్కు అందించారు. మాజీ సర్పంచ్, సీనియర్ నాయకులు పర్లపల్లి రమేష్, ఇల్లందకుంట మాజీ ఎంపీపీ పావని వెంకటేష్, మాజీ ఎంపీటీసీ, నాయకులు పాల్గొన్నారు.



హుజూరాబాద్‌లో పూజలు చేస్తున్న మహిళలు



తిమ్మాపూర్‌లో...

ఘనంగా నాగుల చవితి

జమ్మికుంట: పట్టణం, మండలంలో నాగుల చవితిని పురస్కరించుకొని మంగళవారం దేవాలయాల్లో మహిళలు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. పుట్టలో పాలు పోశారు.

హుజూరాబాద్‌రూరల్: మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లి నాగేంద్రస్వామి ఆలయంలో ప్రధా న అర్చకుడు పందిళ్ల భాస్కర్‌శర్మ ప్రత్యేక పూజలు చేశారు. పుట్టలో పాలు పోసి క్షేమంగా చూడాలని స్వామిని వేడుకున్నారు. భక్తుల కోసం ఆలయ ధర్మకర్తలు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

తిమ్మాపూర్: మండలంలోని ఎల్ఎండీకాలనీ తాపాల లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఆవరణలోని పుట్టలో మహిళలు పాలుపోశారు. అనంతరం మొక్కులు చెల్లించుకున్నారు.

- **రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక**

హుజూరాబాద్‌రూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా అండర్–14 బాలబాలికల కబడ్డీ, హాకీ పోటీలు ఈ నెల 2న పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించారు. కరీంనగర్ జిల్లా బాలికల జట్టు ప్రథమ స్థానంలో గెలుపొందగా సిర్సపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థిని ఎండీ సన అత్యంత ప్రతిభ కనపరిచి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైందని పీఈటీ ఎస్.అనిల్‌కుమార్ మంగళవారం తెలిపారు. పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం మల్లేశం విద్యార్థిని అభినందించి రాష్ట్రస్థాయిలో రాణించాలని కోరారు. 7, 8, 9 తేదీల్లో భువనగిరిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు.

- **నూతన కార్యవర్గం**

గంగాధర: తెలంగాణ రెడ్డి సంఘం గంగాధర మండల కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు వంచ సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో గంగాధర చౌరస్తాలో నిర్వహించారు. మండల అధ్యక్షుడిగా సుద్దాల రాజశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మోతె శ్రీహరిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉప్పుగండ్ల రఘునందన్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా కాడం వీరారెడ్డి, గౌరవ సలహాదారుడిగా ఏరు మల్లారెడ్డి, ఉపాధ్యక్షుడిగా సుద్దాల వంశీకృష్ణారెడ్డి, రొండ్ల కర్ణాకర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

- **7న పుస్తకావిష్కరణ సదస్సు**

హుజూరాబాద్‌రూరల్: ఈ నెల 7న నిర్వహించే శూద్ర హిందీ అనువాద కథల పుస్తకావిష్కరణ సదస్సుకు సకల జనులు హాజరై కార్యక్రమం విజయవంతం చేయాలని ప్రముఖ రచయిత ఇమ్మడి సంపత్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలో మాట్లాడారు. మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించే పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు విభాగం అధిపతి ప్రొఫెసర్ కాసిం హాజరై పుస్తకావిష్కరణ చేసి ప్రసంగిస్తారని తెలిపారు.

- **ధాన్యం తూకం**

శంకరపట్నం: మండలంలోని చింతగుట్ట గ్రామం కొనుగోలు కేంద్రంలో మంగళవారం ధాన్యం తూకం వేసి మిల్లుకు తరలించారు. తాడికల్ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం ద్వారా ధాన్యం తూకం వేసి కరీంపేటలోని శ్రీరామ రైస్‌మిల్లుకు తరలించినట్లు నిర్వాహకులు తెలిపారు.

- **పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి**

హుజూరాబాద్‌రూరల్: పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కారించాలని పెండింగు డీఏలను ప్రకటిస్తూ రెండో పీఆర్సీని ప్రకటించి జూలై 2023 నుంచి అమలుచేయాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చందుపట్ల జనార్దన్ అన్నారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట రాష్ట్రశాఖ ఆదేశానుసారం మంగళవారం ధర్నా నిర్వహించి తహసీల్దార్ కోడెం కనకయ్యకు మెమోరాండం అందజేశారు.

సంక్షిప్త వార్తలు

- **క్షీరాభిషేకం**

జమ్మికుంట: ప్రభుత్వం విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచినందుకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కసుబోజుల వెంకన్న, ఎన్ఎస్‌యూఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ ఇమ్రాన్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ చిత్రపటాలకు మంగళవారం క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పేద విద్యార్థులకు మేలు జరుగుతుందన్నారు.

- **రోడ్డు పనులు పూర్తి చేయాలి**

గంగాధర: మండలంలోని కొండాపూర్ నుంచి విలసాగర్ వరకు వయా చిన్నఆచంపల్లి మీదుగా బీటీ రోడ్డు పనులను అర్ధంతరంగా ఆపేశారని పనులను వెంటనే ప్రారంభించాలని బీఆర్ఎస్ నాయకుడు ఆకుల మధుసూదన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మధురానగర్ ఎక్స్ రోడ్డు చౌరస్తాలో మాట్లాడారు.

- **విద్యార్థులకు బెల్ట్, ఐడెంటీకార్డ్స్**

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బెల్ట్, గుర్తింపుకార్డులను పూర్వ విద్యార్థి, ప్రైవేట్ పాఠశాల యజమాని భూమ సంపత్ అందజేశారు. కలెక్టర్ స్ఫూర్తితో విద్యార్థులకు బెల్ట్, గుర్తింపుకార్డులు అందించినట్లు సంపత్ తెలిపారు.

- **పోచమ్మకట్ట గండి పూడ్చివేత**

మానకొండూర్‌రూరల్: మండలంలోని వేగురుపల్లి పోచమ్మకట్టకు వర్షాకాలంలో గండి పడింది. నెలలు గడుస్తున్నా అధికారులు, నాయకులు పట్టించుకోకపోవడంతో ఈ మార్గంలో ప్రయాణించే హనుమండ్లపల్లి, ఎస్సీకాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండగా బీఆర్ఎస్ నాయకులు మంగళవారం జేసీబీతో గండిని పూడ్చివేయించారు.

- **అనాథ పిల్లలకు చేయూత**

మానకొండూర్: మానకొండూర్‌కు చెందిన కోంద్ర పవన్ కళ్యాణ్, ప్రహర్ష ఇటీవల మృతిచెందగా వారి పిల్లలు ఆధ్యశ్రీ, అయాన్స్ అనాథలయ్యారు. ఎస్పీఎఫ్ ట్రస్ట్, జగిత్యాల మిత్రబృందం పిల్లలకు చేయూత అందించారు. మంగళవారం పిల్లల స్కూల్ ఫీజు చెల్లించి భవిష్యత్ అవసరాల నిమిత్తం రూ.1.30 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి బాండ్ పత్రాలను పిల్లలకు అందించారు.

- **గుండెపోటుతో గీతకార్మికుడి మృతి**

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ ఈతవనంలో మంగళవారం గీతకార్మికుడు గుండెపోటుతో మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. కామారెడ్డి జిల్లా దోమకొండ మండలం అంబారిపేటకు చెందిన రాజుగౌడ్ (65) మంగళవారం కల్లుగీస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలాడు. తోటి కార్మికులు కరీంనగర్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు.

- **చేపల వలలు చోరీ**

గన్నేరువరం: గన్నేరువరంకు చెందిన మత్స్యకారుల వలలు చోరీ చేశారు. మండల కేంద్రం సమీపంలోని లోయర్ మానేరు డ్యాంలో చేపలు పట్టడానికి మత్స్యకారులు నీటిలో కొన్ని వలలు వేసి మరికొన్నింటిని ఒడ్డు పక్కన పెట్టి ఇళ్లకు వెళ్లారు. మంగళవారం వచ్చి చూడగా వలలు చోరీ చేశారని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఐదు క్వింటాళ్ల వలలను ఎత్తుకెళ్లారని, వాటి విలువ సుమారు రూ.ఆరు లక్షల వరకు ఉంటుందని, పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. సంఘటన స్థలాన్ని ఏఎస్సై లక్ష్మీనారాయణ పరిశీలించారు.

- **చికిత్స పొందుతూ మృతి**

శంకరపట్నం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన కాచాపూర్ గ్రామానికి చెందిన లింగంపల్లి నారాయణరెడ్డి(70) వరంగల్ ఎంజీఎంలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడని ఎస్సై రవి తెలిపారు. నారాయణరెడ్డి అక్టోబర్ 20న హుజూరాబాద్ వెళ్తుండగా కొత్తగట్టు మత్స్యగిరీంద్ర స్వామి ఆలయం సమీపంలో కుక్కలు అడ్డురాగా బైక్ అదుపుతప్పడంతో రోడ్డుపై పడిపోయాడు. తలకు తీవ్రగాయాలు కాగా కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి, అనంతరం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా మృతిచెందాడని, మృతుడి కుమారుడు కిషన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై వివరించారు.

- **మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం**

మానకొండూర్: మండలంలోని ఈదులగట్టెపల్లి గ్రామానికి చెందిన అంగిడి సాయికుమార్ అనే బాలుడు ఇటీవల మృతిచెందగా మంగళవారం మృతుడి కుటుంబానికి సోనం సీడ్ ప్లాంట్ యాజమాని రామకృష్ణ, సౌజన్య 25 కిలోల బియ్యం, రూ.ఐదు వేల నగదు, నిత్యావసరాలు అందజేశారు.

- **పేకాట స్థావరంపై దాడి**

జమ్మికుంట : పట్టణంలోని మొబైల్ షాపులైన్‌లోని ఇంట్లో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు టౌన్ సీఐ వరంగంటి రవి ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి పోలీసులు దాడులు నిర్వహించారు. ఐదుగురిని పట్టుకోగా ముగ్గురు పరారయ్యారని తెలిపారు. పట్టుకున్న వారినుంచి రూ.30,680, నాలుగు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని 8 మందిపై కేసు నమోదు చేశామన్నారు. దాడుల్లో హెడ్ కానిస్టేబుళ్లు మోహన్, సదయ్య, కానిస్టేబుల్ వేణు, హోంగార్డు యాకూబ్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలని ధర్నా



గంగాధర: ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ రైతులతో కలిసి మండలంలోని మధురానగర్ చౌరస్తాలో కరీంనగర్–జగిత్యాల ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ పాలనలో రైతులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి వచ్చిందని విమర్శించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు రవిశంకర్‌తోపాటు బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.